క్లుప్తంగా

దాడి ఘటనపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: అకారణంగా మహిళపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్‌ఐ కృష్ణదేవా తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని సాసనూలుకు చెందిన అబ్బూలమ్మ అదే గ్రామానికి చెందిన కుర్వ అనసూయమ్మపై ఈ నెల 21న అకారణంగా దాడి చేసింది. ఈ క్రమంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం బాధితురాలి భర్త కుర్వ భీమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం

అలంపూర్: ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అఖిల భారత ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి హాజరువుతున్నట్లు తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, బూత్ లెవల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వామికి అభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, పుష్పాలంకరణ చేశా రు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, శివ స్వాము లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు

అయిజ: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు పనులు వాయిదా పడినందుకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయ ఉండదని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ పట్టణంలోని 132/33 సబ్ స్టేషన్‌లో గురువారం నిర్వహించాల్సిన మరమ్మతు పనులు వాయిదా పడినట్లు తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లకు సంబంధించి అయిజ, వెంకటాపురం, ఉప్పల, ఉత్తనూరు, చిన్న తాండ్రపాడు, టీటీ దొడ్డి, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, తాటుకుఆట, నాగర్‌దొడ్డి, గట్టు మండలంలోని గట్టు, ఆలూరు, గొర్లఖాన్‌దొడ్డి, మిట్టదొడ్డి, కేటీ దొడ్డి మండలంలోని చింతలకుంట సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ అంతరాయుం ఉండదని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయిలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బుధవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ మడుగు రమేష్ తెలిపారు. తెల్లవారు జామున పెట్రోలింగ్ నిర్వస్తుండగా లింగన్‌వాయికి చెందిన గణేష్ ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పాన్‌కార్డు పేరుతో మోసం

రాజోళి: పాన్‌కార్డు అప్‌డేట్‌తో వచ్చిన లింక్‌ను ఉపయోగించడంతో రూ.21 వేలు అకౌంట్ నుంచి మాయమైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఖాదర్ బాషా వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మిళ్లకు చెందిన ధనుంజయరెడ్డి ఉండవెల్లి మండలం బొంకూరులో పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నాడు. ఈ నెల 10న పాన్‌కార్డు అప్‌డేట్ పేరుతో అధికారిక వాట్సాప్(ఎంపీడీఓ) గ్రూప్‌లో మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేసి, ఓపెన్ చేశాడు. అందులో అడిగిన ఓటీపీలన్నీ చెబుతూ వెళ్లడంతో అకౌంట్‌లో నుంచి రూ.21వేల రూపాయలు మాయం అయ్యాయి. ఆన్‌లైన్ ద్వారా మోసం జరిగిందని గ్రహించిన ఆయన సైబర్ క్రైం పోర్టల్ 1930కు సమాచారం అందించాడు. అనంతరం రాజోళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ.. వ్యక్తి గాయాలు

ధరూరు: మరమ్మతుల నిమిత్తం ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం తెల్లవారుజామున రేవులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమరచింత మండలం నందిమల్లకు చెందిన మ్యాదరి హనుమంతు కుమారుడు రాజు మిషన్‌భగీరథలో విధులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో జూరాల కుడి కాల్వ వద్ద డ్యాంరోడ్డుపై మరమ్మతులకుగురైన ట్రాక్టర్ వదిలేసి వెళ్లారు. దీన్ని గుర్తించని రాజు బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టి గాయాలపాలయ్యాడు. నిర్లక్ష్యంగా బాటకు అడ్డంగా ట్రాక్టర్‌ను వదిలిపోయిన వారిపై చర్యలు తీసుకోవాలని రాజు తండ్రి హనుమంతు బుధవారం రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటస్థలాలు అలంకారమేనా?

- బోర్డులకే పరిమితమైన మైదానాలు
- పరికరాలు లేక యువత క్రీడలకు దూరం
- పట్టించుకోని అధికారులు



మానవపాడులో క్రీడామైదానం

మానవపాడు: గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లెల్లో గ్రామీణ క్రీడామైదానాలను ఏర్పాటు చేసింది. కానీ మైదానాలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. మండంలంలోని ఆయా గ్రామాల్లో మెజారిటీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారుతున్నాయి. క్రీడా ప్రాంగణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆటలు ఆడేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు.

సౌకర్యాలు నిల్..

మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా ఉపకరణాలు ఏర్పాటు చేయలేదు. మండలంలోని 16 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తయినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. చాలా చోట్లా ఇరుకుగా ఉన్న పాఠశాలల్లో మైదానాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని చోట్లా బోర్డులు ఏర్పాటు చేసి సాధన చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. చాలా గ్రామాల్లో క్రీడలు ఆడాలనే ఆశ ఉన్నా పరికరాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

క్రీడా మైదానాలు ఉండాల్సింది..

గ్రామానికి దగ్గరల్లో కనీసం ఎకరం స్థలంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి. క్రీడామైదానం చుట్టూ మొక్కలు నాటాలి. పిచ్చిమొక్కలు తొలగించి మైదానం చదును చేయాలి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి. లాంగ్‌జాంప్‌కోసం ఆరు మీటర్లు పొడవు, మూడు మీటర్ల వెడల్పు, 0.5 మీటర్ల లోతులో గుంత తీసి సున్నితమైన ఇసుకను నింపాలి. వ్యాయామ బార్‌లను ఏర్పాటు చేయాలి. కానీ క్రీడా మైదానాల్లో ఇవేవీ కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. క్రీడా మైదానాల్లో సౌకర్యాలు ఏర్పాటు యువతను ప్రోత్సహించాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



మా ఊరిలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారు. గ్రామంలో ఇరుకుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. దీంతో సాధన చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా కిట్లను ఇంకా అప్పగించలేదు. అధికారులు చొరవ చూపి సాధన చేసేందుకు క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలి.

– ముఖీమ్, అమరవాయి

అధికారులు చర్యలు తీసుకోవాలి..



చాలా గ్రామాల్లో క్రీడాకారులకు కిట్లు అందలేదు. క్రీడామైదానాల్లో రోజువారీగా క్రీడలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. గ్రామస్థాయి నుంచి ఉత్తమ క్రీడాకారులను వెలికితీసేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి. క్రీడామైదానాలు అందబాటులో ఉండేలా, క్రీడాసౌకర్యాలు, కిట్లు అందించేలా అధికారులు చర్యలు తీసకోవాలి.

– రవి, మానవపాడు, క్రీడాకారుడు

అన్ని గ్రామాల్లో ఏర్పాటు..



క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశాం. అసెంబ్లీ ఎన్నికల ముందే ప్రతి గ్రామ పంచాయతీకి క్రికెట్, వాలీబాల్, డంబుల్స్, స్కిప్పింగ్, రింగ్‌బాల్, టీషర్ట్స్ కిట్లను అందించాం. గ్రామాల క్రీడాకారులకు అందకుంటే అందించేలా కృషి చేస్తాం.

– రమణారావు, ఎంపీడీఓ, మానవపాడు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



అలంపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రాజు



అయిజలో హెల్మెట్ ధరించిన వ్యక్తికి గులాబీ పువ్వు ఇస్తున్న ఎస్‌ఐ నరేష్ కుమార్

అలంపూర్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని అలంపూర్ సీఐ రాజు అన్నారు. పట్టణంలోని హరిజనవాడ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐ రాజు, ఎంఈఓ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

అలంపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను సీఐ రాజు సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ రమేష్‌తో మాట్లాడి కేసుల వివరాలను తెలుసుకున్నారు. అలంపూర్ చౌరస్తాలో ఎస్‌ఐ బాల్‌రాజు వాహన తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపే వారికి పుష్పాలు అందించి అభినందించారు.

అయిజ: ప్రతి ఒక్కరు భద్రతా నియమాలు పాటించి, సురక్షితమైన ప్రయాణం చేయాలని ఎస్‌ఐ నరేష్‌కుమార్ అన్నారు. పోలీస్ బృందం పట్టణంలోని ప్రధాన రోడ్లపై వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్లు ధరించి బైక్ నడుపుతున్నవారికి ఎస్‌ఐ గులాబీ పువ్వులను అందజేశారు. బైక్‌లపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

రాజోళి: బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరిస్తే ప్రాణానికి రక్షణ ఉన్నట్లేనని ఎస్‌ఐ ఖాదర్ బాషా అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో సందర్భంగా వాహనదారులకు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు, తదిదర అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చి గౌరవించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడికి బుధవారం రాజోళి గ్రామస్తులు వినతి పత్రం అందచేశారు. కాలేజీ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం వారిని కలిసి మండలంలో కాలేజీ ఆవశ్యకతను వివరించారు. కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల ఎంత మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే విషయాలు వివరించారు. కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, రాజ్‌కిరణ్‌రెడ్డి, జయరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేద్దాం

గట్టు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నియోజకవర్గ ఇన్‌చార్జీ అతికూర్ రహమాన్‌లు కోరారు. బుధవారం మండల కేంద్రంలో నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయంతో కూడుకున్నది బీఎస్పీ మాత్రమేనని, ప్రతి కార్యకర్త బీఎస్పీ అభ్యర్థి గెలుపు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు తిమ్మప్ప, అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మధుగౌడు, గద్వాల నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజు, ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ముని, సవారన్న, సునంద్, ఈరన్న పాల్గొన్నారు.

విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలి



కస్తూర్బాలో విద్యార్థులతో భరోసా సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు షీ టీం, భరోసా సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం కలుగోట్లలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. బాలికలను ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, తాకినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, బాల కార్మికులుగా ఉండకూడదని, బడిలో ఉండాలన్నారు. విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ పరిమళ, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చర్లలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం

రాజోళి: మండలంలోని పచ్చర్లలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఆదివాసి గౌరవ్ దివస్ సందర్భంగా 2023 నవంబర్ 15న ప్రధాని మోడీ ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి నెలకు రూ.500లు ఆర్థిక సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రావ్, ఏపీఎం కోటేశ్వరి, గురుబసయ్య, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజమే



అమరవాయిలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: ఉపాధ్యాయులకు బదిలీలు సహజమేనని, వారు చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలిచి పోతాయని వెంకటేశ్వర్‌రెడ్డి ట్రస్టు నిర్వాహకులు సాగర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు శోభారాణి పదోన్నతిపై గద్వాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భగా ఆమెకు విడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సాగర్‌రెడ్డి, హెడ్మాస్టర్ నరేష్‌లు మాట్లాడు తూ ఐదేళ్లుగా ఆమె పాఠశాలలో పని చేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

మానవపాడు: చిన్ననాటి నుంచి విద్యార్థులకు నైపుణ్యాలను వెలికితీయాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని చండూరు, పల్లెపాడు, బోరవెల్లి, జల్లాపురం తదితర గ్రామాలలో పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు రాయడం, చదవడం, పరీక్షించామన్నారు. ప్రతి విద్యార్థి చదివేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వాల్‌పోస్టర్ విడుదల



గద్వాల అర్బన్: ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జులకల్ మధు, ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రరాములు, వెంకట్రామిరెడ్డి, రాఘవేంద్ర, నర్సింహులు, రంగన్న, బీచుపల్లి తదితరులు ఉన్నారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

అయిజ: మండలంలోని వెంకటాపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పలకు చెందిన ఏజీకేలు కొన్ని రోజులుగా కర్నూల్‌లో కూలీపని చేస్తున్నాడు. ఇటీవల సొంత గ్రామానికి వచ్చిన ఆయన బుధవారం రాత్రి మోటార్ సైకిల్‌పై కర్నూల్‌కు బయలుదేరాడు. అయిజ మండల వెంకటాపురం–వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఏజీకేలుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికల సంక్షేమానికి కృషి చేయాలి



ధరూరులో మాట్లాడుతున్న సహదేవులు

గద్వాల అర్బన్: ఆడపిల్లలను అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్ అన్నారు. బుధవారం పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థిని కావ్య ప్రధానోధ్యాయురాలిగా విధులు నిర్వహించారు.

లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంబీ ప్రభుత్వ హైస్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్ ఉన్నారు.

ధరూరు: బాలికల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల సంక్షేమ సమితి చైర్మన్ సహదేవులు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంబంధ ఖర్చులను భరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి మెంబర్ జయభారతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి న ర్సింహ, ఉమెన్ హబ్ జోత్స్న, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, సిబ్బంది పద్మ, ప్రకాష్, లక్ష్మి, చిట్టెమ్మ, సరోజ పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో జాతీయ బాలికల దినోత్సవాన్ని వన్‌ఫర్‌వన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కుసుమలత, వన్‌ఫర్‌వన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సులోమితమ్మ, జయంతుడు పాల్గొన్నారు.

గట్టు: తల్లిదండ్రులు అమ్మాయిలను చదివించేందుకు ఆలోచించకుండా, వారిని చదువుకోవ్వాలని, ఆ స్వేచ్ఛను ప్రతి తల్లిదండ్రులు కూతుళ్లకు ఇవ్వాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. గట్టు ప్రాంతానికి సరైన రవాణా సౌకర్యాలు లేక పోయినా, ఇక్కడికి చేరుకుని విద్యాబోధన చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఎంపీపీ అభినందించారు. విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. 45 మంది విద్యార్థినీలకు ప్రశ్నా పత్రాల కిట్టును అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, రాయాపురం ఎంపీటీసీ రంగస్వామి, పెంచికలపాడు అంగడి బస్వరాజు, గట్టు రామునాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ తిమ్మప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎనిమియా పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మానవపాడు: వివిధ రకాల వ్యాధుల నుంచి నివారణకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించిందని, దీనికోసం ఎనిమియా ముక్త్ భారత్ పేరుతో రక్త పరీక్షలు నిర్వహిస్తోందని డాక్టర్లు సవిత, రాఘవేంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని జల్లాపురం పాఠశాలలో విద్యార్థులకు ఎనిమియాపై రక్త పరీక్షలు నిర్వహించారు. మార్చి 11వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత నుంచి విముక్తి కలిగించే అవకాశం ఉందన్నారు. లోపాలు ఉన్నవారికి మాత్రలు, ఇతర చికిత్సలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కృషి చేద్దాం



పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రాజాప్రతినిధులు కలిసి కట్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 12వ వార్డులో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కుంగిపోయిన మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. రోడ్లను శుభ్రం చేస్తూ, కాల్వల్లో ఎప్పటికప్పుడు మురుగు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో పేదరికం పెరిగింది



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: బీజేపీ పాలన వల్ల దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిందని, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేసేందుకు కుట్రలు చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 26న జిల్లా కేంద్రంల్లో ట్రాక్టర్ల, వాహనాల ర్యాలీ నిర్వహించనున్నామని, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. దీనిని కార్మికులు, రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ వీవీ నర్సింహ, నాగరాజు, ఆశన్న, కాశీం, రైతు సంఘాల నాయకులు ఉన్నారు.

బిహార్ మాజీ ముఖ్యమంత్రికి నివాళి



మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు నివాళులర్పిస్తున్న నాయీబ్రాహ్మణులు

అయిజ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు మహేష్, అలంపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గోవిందు, అయిజ పట్టణ కార్యదర్శి రాజన్న, ఉపాధ్యక్షుడు సూర్యచంద్రుడు, జిల్లా ప్రచార కార్యదర్శి సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి

మానవపాడు: ప్రతి గ్రామ పంచాయతీలో నిర్దేశించిన ఇంటి పన్ను 100శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ రమణారావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జీపీడీపీ యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రెగ్యులర్‌గా చెత్త సేకరణ చేస్తూ ఎప్పటికప్పుడు సెగ్రిగేషన్ షెడ్‌కు తడి చెత్త ద్వారా వర్మీకంపోస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో 100 శాతం మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రవి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.